క్లుప్తంగా

కూలీ డబ్బులు చెల్లించాలి



నందిపేట్(ఆర్మూర్): 15రోజులు కొకసారి ఉపాధి హామీ కూలీలకు కూలీ డబ్బులు చెల్లించాలని ప్రజాపంథ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్ అన్నారు. నందిపేటలో శనివారం ఆయన ఉపాధిహామీ కూలీల సమస్యలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం చట్ట ప్రకారం కూలీల సమస్యలు పరిష్కరించాలన్నారు. నాయకులు రాజలింగం, దేవయ్య, దశరత్, కుశన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడాలి



మాక్లూర్: విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ఉంటూ, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని ఎంపీపీ మాస్త ప్రభాకర్ వినియోగదారులకు సూచించారు. మండలంలోని మదన్‌పల్లిలో శనివారం విద్యుత్ భద్రత వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరు విద్యుత్‌ను పొదుపుగా వాడటం అలవాటు చేసుకోవాలన్నారు. ఏఈ గోపీ, ఏడీ అశోక్, సర్పంచ్ శంకర్‌గౌడ్, ఎంపీటీసీ గోవూరు ఒడ్డెన్న, బడుగు సత్యం పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రెండో వార్డులో పలువురు లబ్ధిదారులకు శనివారం కౌన్సిలర్ ఖాందేష్ సంగీత కల్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు సత్యం, సాయినాథ్, బండారి నరేష్, రాకేష్, సంతోష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలి



నవీపేట: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అన్ని వర్గాలవారు సహకరించాలని ఎంపీపీ సంగెం శ్రీనివాస్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న పథకాలను ప్రవేశపెట్టిందని, బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, సర్పంచ్ షకీల్, ఐసీడీఎస్ సీడీపీఓ స్వర్ణలత, ఐసీపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోలేదు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు నిర్మాణం పనులు నిలిచిపోవడంలో బీఆర్ఎస్ నాయకుల మధ్య ఎలాంటి ఆధిపత్య పోరు లేదని జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోలేదన్నారు. కేవలం కాంట్రాక్టర్ ఇతర పనుల్లో బిజీ ఉండటంతో పనులు చేపట్టడం లేదన్నారు. మండల కేంద్రంలో చాల పురాతనమైన నివాసాలు ఉండటంతో ఎవరికి ఇబ్బందులు తలెత్తకుండ ఉండటంకోసం వీడీసీతో చర్చలు జరిపినట్లు తెలిపారు. దీనిపై కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ఎవరు ఎలాంటి ముడుపులు డిమాండ్ చేయాలేదన్నారు.

ఘనంగా బౌద్ధ పూర్ణిమ ఉత్సవాలు



సుభాష్‌నగర్: నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో బౌద్ధ పూర్ణి మ ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఆర్ శివప్రసాద్ మాట్లాడుతూ.. బుద్ధుడు చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. నాయకులు సందీప్, శీల శ్రీనివాస్, మీసేవ శ్రీనివాస్, సుధీర్, పవర్, సాయి, వినయ్, రాజు, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా బీటీ రోడ్లు

- మాక్లూర్ మండలంలో వేసిన నెలరోజులకే కుంగిపోతున్న వైనం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు





వల్లభాపూర్‌లో రోడ్డు పక్కన మొరం పోయకుండా వదిలేసిన దృశ్యం.. బోర్గం (కె) చెరువు కట్టపై కుంగిపోయి ప్రమాదకరంగా మారిన రోడ్డు

మాక్లూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇటీవల వేసిన బీటీ రోడ్లు కాంట్రాక్టర్ చేసిన నాసిరకం పనుల వల్ల నెలరోజులకే చిద్రమవుతున్నాయి. ఫలితంగా ప్రజలు తరుచూ రోడ్డు ప్రమాదాలబారిన పడుతున్నారు. దీంతో స్థానికులు సంబంధిత కాంట్రాక్టర్, ఏఈలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.4కోట్ల 56లక్షల నిధులు..

మండలంలోని ఆయా గ్రామాల బీటీ రోడ్ల నిర్మాణాలకు రూ. 4కోట్ల 56లక్షల నిధులు ఆర్‌అండ్‌బీ నుంచి మంజూరు అయ్యాయి. వీటిలో మాణిక్‌భండార్ చౌరస్తా నుంచి బొర్గాం(కె) వరకు రూ.1కోటి 20లక్షలు, కల్లేడి నుంచి చిన్నాపూర్ గండి వరకు రూ: 1కోటి 78లక్షలు, వల్లభాపూర్ నుంచి బొంకన్‌పల్లి వరకు రూ. 1కోటి 58లక్షలు ఆర్‌అండ్‌బీ నుంచి నిధులు మంజూరు అయ్యాయి. పనులను దక్కించుకున్నా కాంట్రాక్టర్ పనులను పూర్తి చేశారు. కానీ రోడ్లు వేసిన నెల రోజులకే పగుళ్లు ఏర్పడటం. కొన్ని చోట్ల వేసిన రోడ్డుకు ఇరువైపులా మొరం వేయటం మర్చిపోయారు. మాణిక్‌భండార్ నుంచి బొర్గాం (కె) వరకు వేసిన బీటీ రోడ్డు చెరువు కట్టపై రెండు వైపుల కుంగిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ విషయమై ఆర్ అండ్‌బీ ఏఈ గులాబ్‌సింగ్‌ను వివరణ కోరగా బొర్గాం(కె) చెరువు కట్టపై ప్రమాదకరంగా మారిన చెరువు తూము పనులను ఇరిగేషన్ అధికారులు పూర్తి చేశారన్నారు. వారి తప్పిదం వల్ల చెరువు కట్టపై తాము వేసిన రోడ్డు కుంగిపోయిందన్నారు. ఐనప్పటికీ కాంట్రాక్టర్‌తో అట్టి పనిని పూర్తి చేయిస్తానని అన్నారు. అలాగే వేసిన రోడ్డుకు ఇరువైపులా మొరం వేయని చోట్ల కూడా వేయిస్తానని ఏఈ గులాబ్‌సింగ్ చెప్పారు.

నాసిరకంగా పనులు..



అభివృద్ధి పనులపై ఏఈల పర్యవేక్షణ లేకపోవటం వల్లే కాంట్రాక్టర్లు నాసిరకం పనులు చేపడుతున్నారు. మా ఊరి చెరువు కట్టపై బీటీ రోడ్డు వేసి నెల రోజులే అయింది. ఇటీవల కుర్షిన చిన్నపాటి వర్షానికే కుంగిపోయింది. దీంతో చెరువు కట్ట పైనుంచి ప్రయాణించాలంటేనే భయం వేస్తుంది.

–ఎనిమి శ్రీనివాస్‌రెడ్డి, బొర్గాం(కె)

మొరం వేయలేదు.



మా గ్రామంలో ఇటీవల బీటీ రోడ్డు వేశారు. కానీ రోడ్డుకు ఇరువైపులా వేయాల్సిన మొరం వేయలేదు. దీంతో వాహనాలు అంచు నుంచి వెళ్లినప్పుడు బీటీ రోడ్డు విరిగి ముక్కలవుతుంది. కొన్నిసార్లు రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

–శిలారి సుధాకర్, వల్లభాపూర్

అభివృద్ధికి కేరాఫ్ ఆర్మూర్

- ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- గ్రామాల అభివృద్ధి, ప్రగతిపై సమీక్ష



అంకాపూర్‌లో సమీక్ష నిర్వహిస్తున్న జీవన్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): అన్ని రంగాల్లో అభివృద్ధి, సంక్షేమానికి ఆర్మూర్ నియోజకవర్గం కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో శనివారం ఆర్మూర్, ఆలూర్ మండలంలోని ప్రజా ప్రతినిధులతో గ్రామాల వారీగా అభివృద్ధి, ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీకే ప్రజలను ఓటు అడిగే హక్కు ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరిగేలా ప్రజా ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలన్నారు. తనను ప్రజలు మూడోసారి సైతం ఎమ్మెల్యేగా గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఇప్పవరకు చేసిన అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులు, చేపడుతున్న పనుల్లో పురోగతి గురించి ప్రజాప్రతినిధులతో చర్చించారు. ఎంపీపీ పస్క నర్సయ్య, జెడ్పీటీసీ సంతోష్, బీఆర్ఎస్ నాయకులు పూజ నరేందర్, ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్‌లు మచ్చర్ల పూజిత కిషోర్‌రెడ్డి, దేవి శ్రీనివాస్‌రెడ్డి, పుట్టింటి లింబారెడ్డి, సాయన్న, సరోజ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అంతానికే బీజేపీ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

వర్ని: దేశంలో అవినీతి అంతానికే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని మాజీ ఎంపీ, బీజేపీ ఉమ్మడి జిల్లా ప్రబారి బూర నర్సయ్యగౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రగతి భవన్ కేంద్రంగా అవినీతికి శిక్షణ ఇస్తుంటే నియోజకవర్గంలో అవినీతి సబ్ సెంటర్ కొనసాగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో అకాల వర్షాలతో రైతన్న నష్టపోతుంటే రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదని, పరిహారం ఇస్తానని నెలలు గడుస్తున్న పైసా కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. రైతు సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పథకంపై విచారణ చేపట్టి అవినీతి పరుల అంతం చూస్తామని అన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు బసవ లక్ష్మీ నర్సయ్య, కామారెడ్డి అధ్యక్షురాలు అరుణతార, కొత్తకొండ భాస్కర్, మాల్యాద్రి రెడ్డి, భూపాల్ రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న పండిత్ వినీత



పోచంపాడ్‌లో మాట్లాడుతున్న అధికారులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ప్రాజెక్ట్ వర్క్‌లను పరిశీలించారు. క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు(వేసవి శిక్షణ శిబిరం) శనివారం ముగిసింది. ఈ క్యాంపులో నృత్య ప్రదర్శనలు, సంగీతం, బ్యూటీషియన్, పబ్లిక్ స్పీకింగ్ లాంటి కోర్సుల్లో విద్యార్థులు నైపుణ్యం నేర్చుకున్నారన్నారని ఆర్‌సీవో యేసుపాదం పేర్కొన్నారు. ఎంఈఓ రాజేశ్వర్, ప్రిన్సిపాల్ సుదర్శన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె

మాక్లూర్/ఆర్మూర్‌టౌన్/రుద్రూర్/ఎడపల్లి(బోధన్)/వర్ని/బాల్కొండ/కమ్మర్‌పల్లి: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో వీవోఏలు చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. ఈసందర్భంగా వీవోఏలు ప్రభుత్వ తీరును నిరసిస్తూ, మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యగా స్పందించి తమ డిమాండ్లను అంగీకరించాలన్నారు.

పలు మండలాల్లో వీవోఏల సమ్మెకు వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు.



ముప్కాల్ మండల కేంద్రంలో..



వర్ని మండల కేంద్రంలో..



మాక్లూర్‌లో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న వీవోఏలు



రుద్రూర్‌లో వీవోఏల సమ్మెకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

ఉద్యోగ భద్రత కల్పించాలి



నందిపేటలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న కారోబార్లు, కార్మికులు

నందిపేట్(ఆర్మూర్)/మాక్లూర్/రుద్రూర్/ఎడపల్లి/కమ్మర్‌పల్లి/వేల్పూర్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కారోబార్లు, పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో చేపట్టిన నిరసన దీక్షలు శనివారం రెండోరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయా మండలాల్లోని కారోబార్లు, కార్మికులు మాట్లాడుతూ.. కారోబార్‌లను, బిల్‌కలెక్టర్లకు అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రత్యేక హోదా కల్పించాలన్నారు. కనీస వేతనం రూ. 21, 500 ఇవ్వాలని, జీపీలో పనిచేస్తున్న సిబ్బందికి రూ. 15,500 ఇవ్వాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించి, జీపీల నుంచి కాకుండా నేరుగా ప్రభుత్వం వేతనాలు ఇవ్వాలన్నారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో కారోబార్ల సమ్మె శిబిరాన్ని కాంగ్రెస్, బీజేపీ నాయకులు వేర్వేరుగా సందర్శించి, వారికి మద్దతుగా బైఠాయించారు.



ఎడపల్లి మండల కేంద్రంలో..



కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో..



వేల్పూర్ మండల కేంద్రంలో..

మొక్కజొన్న పంటల పరిశీలన



రుద్రూర్: పోతంగల్ మండలంలో టాక్లీ, దొమలేడ్గి శివారులో మొక్కజొన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ పరిశీలించారు. కోతకోసి కుప్పపోసిన మొక్కజొన్నకు అకాల వర్షం వల్ల మొలకలు వచ్చాయని రైతులు డీఏవో దృష్టికి తెచ్చారు. మండలంలో 640ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగయింది. ఇప్పటికే సగానికి పైగా పంటను విక్రయించారు. త్వరగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాల్సిందిగా రైతులు కోరారు. త్వరలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని డీఏవో పేర్కొన్నారు.

సాహూ మహారాజ్‌కు ఘన నివాళి



వేల్పూర్: మండలంలోని రామన్నపేట్‌లో అంబేడ్కర్ సంఘ సభ్యులు శనివారం ఛత్రపతి సాహూ మహారాజ్ 101 వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళులు అర్పించారు. అంబేడ్కర్ సంఘ సభ్యులు బాబూరావు, సుమన్, వినోద్, సిహెచ్ దినేష్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలు కోసం పోరాడాలి



బోధన్‌లో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

బోధన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలు పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. బీజేపీని మరోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకునేలా ప్రజలను చైతన్య పర్చేందుకు బీజేపీకీ హటావో, దేశ్‌కో బచావో నినాదంతో పార్టీ జాతీయ కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జీపు యాత్ర చేపట్టామని వెల్లడించారు. ఈమేరకు శనివారం పట్టణంలో నిర్వహించిన జీపుయాత్ర సభలో పద్మ మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడేందుకు ప్రజలను సమాయత్తం చేసేందుకు ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని ఉమ్మడిగా నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. మూతపడిన బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీని తిరిగి తెరిపించాలని, అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు కంజర భూమయ్య, సుధాకర్, షేక్‌బాబు, స్వరూప పాల్గొన్నారు.

కోటగిరి మండలకేంద్రంలో..

రుద్రూర్: కోటగిరి మండలకేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో జీపుయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, బహిరంగ సభలో మాట్లాడారు. నాయకులు విఠల్‌గౌడ్ సుధాకర్, దుబాస్ రాములు, రఘురాం నాయక్ పాల్గొన్నారు.

సమాచారం..

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ



ఆర్మూర్: మామిడిపల్లిలో ఆదివారం సాయంత్రం 14 అడుగుల అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అంబేద్కర్ యువజన సంఘం నాయకులు శనివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉస్మానియ యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసీం, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.

రేపు నందిపేట్ మండల సమావేశం

నందిపేట్(ఆర్మూర్):నందిపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ వాకిడీ సంతోష్ రెడ్డి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో నాగవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే సమయానికి ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేడు ముప్కాల్ మండలంలో మంత్రి పర్యటన

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో ఆదివారం రాష్ట్ర మంత్రి ప్రశాంత్‌రెడ్డి పర్యటిస్తారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారి 63 నుంచి జాతీయ రహదారి 44చాకీర్యాల్ వరకు వయా డొంక్కల్ మీదుగా తారు రోడ్డు పునరుద్ధరణ పనుల శంకుస్థాపనలో మంత్రి పాల్గొంటారన్నారు.

సంక్షిప్తం

నవీపేటలో వైద్య శిబిరం



నవీపేట: మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీలో సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి సూర్య నారాయణ రోగులను పరీక్షించి మందులు అందజేశారు. మేడే వారోత్సవాలలో భాగంగా శిబిరం ఏర్పాటు చేసినట్లు పార్టీ కార్యదర్శి నాయక్‌వాడీ శ్రీనివాస్ పేర్కొన్నారు.

అక్రమ తీర్మానంపై చర్యలు తీసుకోవాలి

కమ్మర్‌పల్లి: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అక్రమ తీర్మానం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు కోరారు. కమ్మర్‌పల్లిలో శనివారం వారు మీడియాతో మాట్లాడారు. అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న దళిత మహిళ గాయత్రిని అక్రమ తీర్మానం చేసి విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

దళిత రత్న అవార్డు గ్రహీతకు సన్మానం



ఎడపల్లి(బోధన్): మండలంలోని పోచారం గ్రామానికి చెందిన నీరడి రవికుమార్‌కు ఇటీవల దళిత రత్న అవార్డు దక్కింది. ఈసందర్భంగా వీడీసీ ప్రతినిధులు, గ్రామస్తులు శనివారం రవికుమార్‌ను ఘనంగా సన్మానించారు.

ప్రశాంతంగా టీఎస్‌ఆర్‌జేసీ పరీక్ష

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో శనివారం టీఎస్ ఆర్‌జేసీ సెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ పరీక్షకు 5,756 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 4,972 మంది హాజరయ్యారు.

సాంకేతిక లోపంతో మోగిన బ్యాంక్ అలారం

ఖలీల్‌వాడి: నగరంలోని యాదగిరిబాగ్ ప్రాంతంలోగల ఓ ప్రయివేట్ బ్యాంక్ అలారం శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం మోగడంతో కాలనీవాసులు భయందోళన చెందారు. బ్యాంక్‌లో దొంగతనాలు జరిగితేనే అలారం మోగుతుందని కాలనీవాసులు భావించారు. శనివారం ఎస్సై తిరుపతి ఘటన స్థలాన్ని చేరుకొని, వివరాలు సేకరించారు. సాంకేతిక లోపంతో అలారం మోగినట్లు ఎస్సై చెప్పారు.